క్లుప్తంగా

ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ఏపీ జెన్‌కో మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో భవ్యహెల్త్ సర్వీసెస్ వారిచే ఉచిత గుండె వైద్య శిబిరాన్ని స్థానిక జెన్‌కో క్వార్టర్స్ వద్ద మంగళవారం నిర్వహించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ విశ్వనాథ్ అధ్వర్యంలో 158 మందికి బీపీ, ఈసీజీ, ఎకో గుండె పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్‌కో ఈఈ వైఎస్‌ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ గుండె వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యాయామం, దైనందిన అలవాట్లు, ఆహార నియమాలు పాటిస్తే గుండె ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అదే విధంగా గుండె జబ్బులను ప్రాథమికంగా గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో డీఈ జి.రాజారెడ్డి, వైద్యులు విశ్వనాథ్, షమీర్, అలీ, బి.ఉషాభవాని, టెక్నీషియన్స్ రమేష్, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి

మాచవరం: అనారోగ్య కారణంగా ఆత్మహత్యకు పాల్పడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన సఫావత్ జ్యోతిభాయి (32) ఏడాది క్రితం ప్రమాదానికి గురికాగా, ప్రమాదంలో కాలికి బలమైన గాయాలయ్యాయి. ఆపరేషన్ అనంతరం కొంత కాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతూ ఉంది. కాళ్ల నొప్పులు భరించలేక ఈనెల 17న ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సమీర్ భాషా తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



మాచవరం: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జెడ్పీటీసీ జె.శివాయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధులను శుభ్రపర్చారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దోమల వలన కలిగే సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొండేటి కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు శివారెడ్డి, పెరుగు రోశయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్‌ఓ వై.అఖిల్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

పిడుగురాళ్ల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నరసరావుపేట డీఎస్పీ మహేష్ మంగళవారం పిడుగురాళ్ల పట్టణంలో విచారించారు. ఆగస్టు 28వ తేదీన రెంటచింతలలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ హనుమంతరావు దాచేపల్లి మండలానికి చెందిన వట్టెపు మరియదాసును దుర్భాషలాడి కులం పేరుతో దూషించినట్లు పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ సంఘటన పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద జరిగిందని కేసు నమోదు అయింది. దీంతో వట్టెపు మరియదాసు కోరినమేరకు నరసరావుపేట డీఎస్పీ మహేష్ విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే డీఎస్పీ పిడుగురాళ్ల పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్దకు వచ్చి విచారించారని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు.

బంగారం, వెండి నగలు చోరీ

మాచవరం: ఇంట్లో ఎవరూలేని సమయంలో బంగారం, వెండి నగలు చోరీకి గురైన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుంటూరు జానీ బాషా సొంత పనుల నిమిత్తం కుంటుంబీకులతో కలిసి సోమవారం పిడుగురాళ్ల బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంటి పక్కన సోదరుడు పొలం పనులకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్న సమయంలో ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన బాధితుని తాతయ్య జాను విషయాన్ని జానీబాషాకు తెలియజేశారు. ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని బీరువాలో దాచిన సుమారు రూ.1లక్షా 92 వేలు విలువ చేసే బంగారం, వెండి నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సమీర్ బాషా తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



పిడుగురాళ్ల ఎస్‌ఈబీలో విచారిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్



పల్నాడు జిల్లా ఎక్సైజ్ జిల్లా అధికారులు సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గురజాల : విధి నిర్వహణలో ఎవరైనా సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్సుమెంట్ పి.నాగమద్దయ్య హెచ్చరించారు. స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో కమిషనర్ రవి ప్రకాష్ ఆదేశాల మేరకు సెబ్ చెక్ పోస్టులను, బోర్డర్ సరిహద్దు ప్రాంతాలను ఆకస్మికంగా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సరిహద్దు ప్రాంతం అయిన పొందుగుల, తంగెడ వద్ద చెక్ పోస్టు, కృష్ణానది పరివాహక సరిహద్దు ప్రాంతాలైన తంగెడ, పొందుగుల, దైద, గొట్టిముక్కల, తేలుకుట్ల, సమాదానంపేట, జెట్టిపాలెం, సత్రశాల గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంగెడ, పొందుగుల చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఏపీకి మద్యం సరఫరా కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు గురించి వివరించారు. కృష్ణానదిలో పడవల ద్వారా మద్యం రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అక్రమ మద్యం రవాణాను అరికట్టాలన్నారు. అనంతరం సెబ్ కార్యాలయాన్ని పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. నాటుసారా , గంజాయి వంటి మత్తు పదార్థాలను కట్టడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ డి.ఎస్.దుర్గాప్రసాద్, గురజాల సెబ్ ఎస్‌ఐ జయరాం, సిబ్బంది తదితరులున్నారు.

అక్రమ మద్యం రవాణాపై కఠిన చర్యలు

మాచర్ల: పల్నాడు జిల్లాలో అక్రమంగా నాటుసారా, మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డీఎస్ దుర్గా ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవిప్రకాష్ ఆదేశాల మేరకు మాచర్లలో పలు ప్రాంతాలను సందర్శించారు. అందులో భాగంగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నాగమద్దయ్య, దుర్గారావులు పీడబ్ల్యూడీ కాలనీలో ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో నాన్ డ్యూటీ పెయిడ్, అక్రమ మద్యం రవాణా చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.వి.ప్రసాద్‌రెడ్డికి తెలిపారు. తెలంగాణ ప్రాంతం నుంచి మాచర్లకు అక్రమ మద్యం తరలిరాకుండా చూడాలన్నారు. విజయపురిసౌత్ ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద అధికారులు, సిబ్బంది పనితీరు సరిగా లేదన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ నుంచి వాహనాలను పరిశీలించి అక్రమ మద్యం రవాణా చేసేవారిపై కేసు నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు పలు కేసుల్లో పట్టుబడిన నాటుసారా, అక్రమ మద్యం తరలించేవారిని బైండోవర్ చేసుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సరిహద్దు గ్రామాలపై దృష్టి పెట్టండి

పిడుగురాళ్ల: తెలంగాణ సరిహద్దు గ్రామాలపై దృష్టి పెట్టాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పి.నాగమద్దయ్య సూచించారు. పట్టణంలోని ఎస్‌ఈబీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా పట్టణ ఎస్‌ఈబీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు నమోదు అయిన నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అలాగే తెలంగాణ సరిహద్దు గ్రామాలైన మాచవరం మండలంలోని గోవిందాపురం, మోర్జంపాడు, చెన్నాయిపాలెం, రేగులగడ్డ, వెల్లంపల్లి గ్రామాల్లోని కృష్ణా పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి నిషేధిత తెలంగాణ మద్యాన్ని తీసుకొని వచ్చినా, నాటుసారాను ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా అటువంటివారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణా నాటుసారా పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాత కేసుల్లో పట్టుబడిన నిందితులపై నిఘా ఏర్పాటు చేసి అవసరమైన వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.ఎస్.దుర్గా ప్రసాద్, పిడుగురాళ్ల ఎస్‌ఈబీ సీఐ ఎస్. కొండారెడ్డి, బీఎంపీపీ ఎస్‌ఐ దీప్తికారంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అవగాహన

- చేర్పులు, మార్పులపై పార్టీల ప్రతినిధులకు అవగాహన ఉండాలి
- ఇన్‌చార్జి ఎన్నికల అధికారి మీసాల దానియేలు



పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయంలో పార్టీల సమావేశంలో ఎన్నికల అధికారి

పిడుగురాళ్ల: ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన ఉండాలని గురజాల ఇన్‌చార్జి ఎన్నికల అధికారి గురజాల తహసీల్దార్ మీసాల దానియేలు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గురజాల నియోజకవర్గ స్థాయి అన్ని పార్టీల నాయకులకు అవగాహన కార్యక్రమం ఎన్నికల అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దానియేలు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నూతన ఓట్లు చేర్పటం, మరణించిన వారి ఓట్లను తొలగించటం , అడ్రస్‌లు మార్పులు, చేర్పులు చేయటం, వేర్వేరు ప్రాంతాలలో ఓట్లు ఉన్నవారికి ఒక ప్రాంతంలో ఓటు ఉండేవిధంగా చూడటం వంటి కార్యక్రమాలను బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. అన్ని పార్టీల నాయకులు స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. అలాగే తక్కెళ్లపాడు ఎన్నికల బూత్ మార్పు విషయమై అధికారులను టీడీపీ నాయకులు ప్రశ్నించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణలో జరిగే విధంగా చర్యలు చేపట్టినట్టు అధికారులు బదులిచ్చారు. అలాగే ఎన్నికల నిర్వాహణ అంశంపై పలు సూచనలు, సలహాలను రాజకీయ పార్టీ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, గురజాల కమిషనర్ మోహన్ శ్రీనివాస్, తహసీల్దార్లు చక్రవర్తి, ప్రసాద్, జి.కరుణకుమార్, ఆయా పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆశాజ్యోతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల

గురజాల : నిరుపేద ప్రజల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక బేడ బుడగ జంగాల కాలనీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేడ బుడగ జంగం కాలనీ వాసులు గత కొన్ని సంవత్సరాలుగా కుల ధ్రువీకరణ పత్రాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను పలు దఫాలు సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి నివేదికను ఢిల్లీకి పంపించారన్నారు. సీఎం వైఎస్ జగన్ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సీఎంకు రుణపడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్ పర్సన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, నాగులుమేస్త్రీ, కౌన్సిలర్‌లు గంధం పద్మ చిన్నా, బండి రవికుమార్, చంద్రయ్య, ఊబూది సూరయ్య, ముక్కంటి నీలంరాజు, కత్తి రవికుమార్, కె.అనిల్‌కుమార్, నాసర్ సైదా తదితరులున్నారు.

అంబేడ్కర్ కోనసీమలో పిడుగురాళ్ల వాసి హతం



కొమ్మూరి పరబ్రహ్మచారి

పిడుగురాళ్ల: అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొత్తపేట మండలం మదనపల్లిలో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన కొమ్మూరి పరబ్రహ్మచారి హత్యకు గురయ్యాడు. వివరాల ప్రకారం మందపల్లి శనీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన కొమ్మూరి పరబ్రహ్మచారి అతని స్నేహితుడు గడ్డం నాగభూషణం వెళ్లారు. దర్శనం అనంతరం సోమవారం రాత్రి గ్రామంలో మద్యం సేవిస్తుండగా ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకోవటంతో నాగభూషణం మద్యం సీసాతో పొడవడంతో పరబ్రహ్మచారి(41) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలో పరబ్రహ్మచారి ఆర్‌ఎంపీగా వైద్య సేవలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా వీరిద్దరు స్నేహితులు కావడం గమనార్హం. కొన్ని కారణాల వలన గతంలో కూడా వీరి మధ్య వాగ్వాదం జరిగినట్లు బంధువులు తెలుపుతున్నారు. సఖ్యతగా ఉండి నమ్మించి శనీశ్వరస్వామి దర్శనానికి తీసుకొని వెళ్లి అక్కడ చంపి ఉంటాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడు పరబ్రహ్మచారికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



మిరియాల గణేష్

నరసరావుపేట టౌన్: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రబాబునాయుడు కాలనీకు చెందిన మిరియాల గణేష్ (12) పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి వినాయకుడి నిమజ్జన ఊరేగింపు తిలకించేందుకు కోట సెంటర్‌కు వచ్చాడు. అక్కడ వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దిమ్మె ఎక్కి చూస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు కర్ర సహాయంతో బాలుడిని పక్కకు నెట్టారు. వెంటనే 108 సహాయంతో సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు మృతుడి తల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువతి దుర్మరణం

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



మృతి చెందిన అశ్విని

రొంపిచర్ల: వేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పైన గల సిమెంట్ పోల్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న యువతి కిందపడి మృతి చెందిన ఘటన మండలంలో తుంగపాడు గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేటకు చెందిన ఓ ఈవెంట్స్‌లో అశ్విని (22), మున్నా అనే యువతీ యువకులు పని చేస్తున్నారు. సోమవారం రాత్రి డాన్స్ ఈవెంట్‌కు హాజరై రొంపిచర్ల మీదుగా నరసరావుపేటకు బైక్ మీద వస్తుండగా తుంగపాడు గ్రామ సమీపంలో గల బ్రిడ్జి వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి సిమెంట్ పోల్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో బైక్ కింద పడిపోవడంతో బైక్ నడుపుతున్న మున్నాకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్ వెనుక కూర్చున్న అశ్విని రోడ్డు ప్రక్కన గల కాలువలో పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నరసరావుపేట వైపు వెళ్తున్న వారు అక్కడ పడి ఉన్న వీరిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కాలువలో పడిన అశ్విని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అదే విధంగా తీవ్ర గాయాలైన మున్నాను చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా మృతురాలు అశ్విని తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. మున్నా నరసరావు పేటకు చెందిన వాడని పోలీసులు తెలిపారు. కాగా మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సి.హెచ్.సురేష్ బాబు తెలిపారు.

భరతనాట్య సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



వినుకొండ(నూజెండ్ల): బెజవాడ చారిటబుల్ ట్రస్ట్, లిటిల్ చాంప్స్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 1వ తేదీన వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి భరతనాట్య సమ్మేళనం పోస్టర్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ భరతనాట్య సమ్మేళనం నిర్వహించడం చాలా మంచి సంప్రదాయమని కొనియాడారు. సమాజంలో విశిష్టసేవ చేస్తున్న వారిని గుర్తించి వారికి జాతీయ గురుబ్రహ్మ, జాతీయ సేవకులు సేవా పురస్కారం అందజేయడం సంతోషకరమన్నారు. పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల వెంకట రామిరెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా, ఉపాధ్యాయులు హెచ్.నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి ఖోఖో జట్ల ఎంపిక



కారెంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గ స్థాయి ఖోఖో జట్ల ఎంపికలు స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగాయి. అండర్-14, అండర్-17 బాల, బాలికల నియోకవర్గ స్థాయి ఖోఖో జట్లను ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని మొత్తం ఐదు మండలాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. మాచర్ల నియోజకవర్గ క్రీడా కో ఆర్డినేటర్ ఎక్కుస్ రాజు, ఎంపిక కమిటీలో వివిధ హోదాలలో వ్యవహరిస్తున్న, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు స్వర్ణరాజు, జె శ్రీనివాసరావు, అనిల్, కత్తి రవి, చిన్న రత్తయ్య, కాలేశ్వరరావు, బ్రహ్మయ్య పోటీలు నిర్వహించి క్రీడా జట్లను ఎంపిక చేశారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతశివ, ఎంఈఓ-1 కొరకంటి కాంతారావు, ఎంఈఓ-2 రవికుమార్, విద్యా కమిటీ చైర్మన్ గోపీ పాల్గొన్నారు.

మత్స్యకారులకు భరోసా



చేపపిల్లలను విడుదల చేస్తున్న జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మార్కొండారెడ్డి

విజయపురిసౌత్: రాష్ట్రంలో మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కల్పించి వారి జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల మండలంలోని అనుపు కృష్ణా జలాశయంలో 40 లక్షల చేపపిల్లలను విడుదల చేసి మాట్లాడారు. ఏడాదిలో చేపలవేట నిషేధం ఉన్న రెండు నెలలకు గాను నెలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తుందన్నారు. చేపలవేటలో ప్రమాదవశాత్తు మృతిచెందిన వారికి రూ.10 లక్షల అందించి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. మత్స్యకారుల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి, ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏఎఫ్‌వో శ్రీనివాసరావు, స్థానిక మత్స్యకారుల సంఘం నాయకుడు కారే మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

రెంటచింతల: రసాయనిక ఎరువులతో కన్నా ప్రకృతి వ్యవసాయం చేయడం వలన రైతులకు ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటలను ప్రకృతి వ్యవసాయం క్షేత్ర సహాయకులు తిరుపతిరావు, వీఏఏ జగన్‌తో కలసి పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో రాజీ లేని సూత్రాల ద్వారా వేసవి దుక్కులు, పీఎండీఎస్, ఘన జీవామృతం, ద్రావణాలు, కషాయాలు, ఆచ్ఛాదన, వాపస, సరిహద్దు పంటలు, యగ్ర పంటలు, అంతరపంటలు, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటుచేయడం వంటి పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని, ఆరోగ్య కరమైన పంటను పండించవచ్చునన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలకు ఆశించే రసం పీల్చు పురుగులను(తెల్లదోమ, పచ్చదోమ, తామరపురుగు, పేను బంక, ఎర్రనల్లి) నివారించేందుకు అధికారుల సూచనలతో కషాయాలను పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో పంటలను సాగు చేయడం వలన వారికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

రైతన్నకు అండగా ఉందాం

మాచర్ల రూరల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతన్నలకు ప్రత్యామ్నాయ పంటలపై ప్రోత్సాహక సహాయ సలహాలు అందించి వారికి అండగా ఉండాలని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కొప్పునూరు గ్రామంలోని ఆర్బీకే కేంద్రంలో రైతులనుద్దేశించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలను ఆదుకునేందుకు నిరంతరం వారి సంక్షేమం కోసం పనిచేస్తున్నారని ఎక్కడా లేని విధంగా ఆర్బీకేలు ఏర్పాటు చేసి వారి గ్రామంలోనే వ్యవసాయాధికారులను అందుబాటులో ఉంచి సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులు అందించటమే కాకుండా ఇన్‌పుట్ సబ్సిడీ ఇన్సురెన్సు వంటి పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. రైతులకు విలువైన సలహాలను సకాలంలో అందించి వారికి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్బీకే రికార్డులను తనిఖీ చేసి తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధికారి ఐ.మురళి, ఏడీఏ జగదీష్‌రెడ్డి, ఏఓ లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

మాచవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 18 తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యు.వరప్రసాద్ తెలిపారు. ఇప్పటికే మండలంలో పలు గ్రామాల్లో వలంటీర్లు, ఆశ వర్కర్లు ఇంటింటి సర్వే చేపట్టి ఆన్‌లైన్ లో వివరాలు నమోదు చేసి, టోకెన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. క్యాంపుల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలు, శిశు సంరక్షణ, అంటు వ్యాధులు పలు రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 30న మాచవరం, 3న పిల్లుట్ల, 4న కొత్తపాలెం, 5న కొత్తగణేశునిపాడు, 6న పిన్నెల్లి-1, 7న మోర్జంపాడు, 9న గంగిరెడ్డిపాలెం, 10న శ్రీరుక్మిణీపురం, 11న తురకపాలెం, 12న మల్లవోలు, 13న పిన్నెల్లి-2, 16న మోర్జంపాడు-2, 17న వేమవరం, 18న చెన్నాయపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. కావున ఆయా గ్రామాల ప్రజలు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.


జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి : ఎంపీడీవో ఫణికుమార్

గురజాల : ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఆర్.ఫణికుమార్ నాయక్ , నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్‌లు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించడం జరుగుతుందని ఈనెల 30వ తేదీ నుంచి గ్రామాల్లో శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య ఆరోగ్య సిబ్బందికి సహకరించాలన్నారు.

మహిళల భద్రతకు భరోసా దిశ

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వజ్ర సంకల్పంతో తీసుకువచ్చిన నూతన సాంకేతిక విప్లవం దిశ యాప్ మహిళల భద్రతకు ఒక భరోసా కల్పిస్తున్నట్లు కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక సాగర్‌మాత జూనియర్, విజ్‌డమ్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఆపదలో ప్రయోజనం పొందవచ్చన్నారు. మహిళల భద్రతకు సీఎం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే దిశ యాప్ ద్వారా పలువురు రక్షణ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. కళాశాలలో ర్యాగింగ్ అనే పెనుభూతం వలన కలిగే అనర్థాలు, నష్టాలను వివరించారు. యువత సెల్‌ఫోన్‌కు ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య ద్వారానే విద్యార్థులు మంచి పౌరులుగా గుర్తింపు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ జె. సామెల్ రాజీవ్‌కుమార్, కళాశాలల కరస్పాండెంట్ ఫాదర్ కొణతం ఎలిషారాజు, అధ్యాపకులు ఎం.వెంకట్, బి.శౌరి, వి.రమణాచార్యులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని మంగళవారం ఉదయం కళ్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీకి చెందిన వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావు, నట్టువ రాధాకృష్ణ, చెన్నకేశవరావు, కోటిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి కళ్యాణం జరిపారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారికి పూజలు చేసి, హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ శ్రీ జగన్నాదం సాల్మన్ @ శ్రీను S/o వెంకయ్య, దాచేపల్లి నగర పంచాయితీ, పలనాడు జిల్లా తరుపున యావన్మందికీ తెలియజేయునది ఏమనగా

నా క్లయింట్ దిగువ షెడ్యూలు ఆస్తిని దాచేపల్లి నగర పంచాయితీ కాపురస్తుడు శ్రీ కొప్పుల శ్రీనివాసరావు S/o సీతారామయ్యకు విక్రయ అగ్రిమెంటును ఇచ్చి అగ్రిమెంటు షరతులకు వ్యతిరేకంగా వ్యవహరించినందున నా క్లయింట్ గౌరవ శ్రీ గురజాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో OS 143/ 2023 నంబరు దావా వేసియున్నారు. సదరు దావా పెండింగులో వుండగా దావా షెడ్యూలు దాఖలా ఆస్తిని, అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నములు చేయుచున్నట్లుగా నా క్లయింట్‌కు తెలియవచ్చినది. కనుక సదరు ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జెల్లనేరవని మరియు నా క్లయింట్ తీసికొను అన్ని సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: పలనాడు జిల్లా, నరసరావుపేట రిజి స్ట్రేషన్ జిల్లా, గురజాల సబ్ రిజిస్ట్రేషన్, దాచేపల్లి మండలం, కేశానుపల్లి గ్రామంలో డి.నెం. 202/2 నందు ఎం-68 సెంట్లు విస్తీర్ణము గల వ్యవసాయ భూమికి హద్దులు. తూర్పు: రాజవరపు చినరాములు భూమి, దక్షిణం: కర్నాటి రాములు భూమి, పడమర: కొప్పుల పాండు వగైరాల భూమి, ఉత్తరం: వాగు పోరంబోకు

కత్తి చలమరాజు, MA, Phil, LLM
వాది తరుపు న్యాయవాది, గురజాల

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)

Office mail : sakshigntadvt@gmail.com